


శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం సాయంత్రానికి 18715 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 77.988 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 250, ఎన్ఎఫ్‌సికి 400, పెన్నా డెల్టాకు500, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.935 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# వాహన మిత్ర పథకం కోసం దరఖాస్తులు

## జిల్లా కలెక్టర్ హిమాన్స్ శుక్లా



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** ఆటో, మాక్సీ క్యాబ్ వాహన యజమానులు వాహన మిత్ర పథకం కోసం సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీలోగా దరఖాస్తులను అందించాలని ఆయన సూచించారు. రిజిస్ట్రేషన్ కార్డ్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, ఫిట్ నెస్ మొదలైన సర్టిఫికెట్లతో దరఖాస్తులు అందించాలన్నారు. బ్యాంక్ అకౌంట్‌కి ఆధార్ ఎన్‌పిసిఐ లింక్ చేసుకోవాలన్నారు. గతంలో (2023 వరకు) ఈ పథకం కోసం దరఖాస్తు చేసిన వారు మరలా దరఖాస్తు చేయావల్సిన అవసరం లేదని, ఇప్పటి వరకు దరఖాస్తు చేయని వారు మాత్రమే సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆటో, మాక్సీ క్యాబ్ వాహన యజమానుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

# ప్రధాన న్యాయమూర్తి ని కలిసిన కలెక్టర్



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి నూతనంగా వచ్చిన కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# ఫైనాన్స్ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, మెంబర్ ఆఫ్ ఫైనాన్స్ కమిటీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం ఢిల్లీలోని సంవిధాన్ సదన్‌లో జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశానికి ముందు ఫైనాన్స్ కమిటీ సభ్యులకు ప్రత్యేక ఫొటో సెషన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఫొటో సెషన్‌లో మిగతా కమిటీ సభ్యులతో ఆయన ఫొటోలు దిగారు. అనంతరం కమిటీ సమావేశంలో పాల్గొని వివిధ ఆర్థిక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

# ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించిన ఎస్పీ



**నెల్లూరు క్రైమ్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** ఏఆర్‌హెడ్ క్వార్టర్స్‌లోని ఆయుధాల గది, స్టోర్ రూమ్, అడిషనల్ యస్.పి.(ఏఆర్), డిఎస్పి (ఏఆర్), ఆర్ఐ అడ్మిన్, ఆర్ఐ వెల్ఫేర్ గదులు, ఇంటిగ్రేటెడ్ పోలీస్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల గురువారం సందర్శించారు. బెల్ ఆఫ్ ఆమ్స్‌లో గల ఆయుధాల ఎన్ని ఉన్నాయి? ఏవేవి ఉన్నాయి? మందుగుండు సామాగ్రి, స్టోర్ రూమ్‌లో గల అత్యవసర సామాగ్రి తదితర వస్తువులను పరిశీలించారు. ఆయుధాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, బాధ్యతాయుతంగా విధులను నిర్వర్తించాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను సందర్శించి సిసి కెమెరాలు, ఎల్‌హెచ్ఎంఎస్, వీడియో వాల్, డయల్ 112 కంట్రోల్ రూమ్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ సిసి టివి కెమెరాలు, ఏవి పని చేస్తున్నాయి..? ఎక్కడెక్కడ పనిచెయ్యట్లేదు..? ఎందుకు..అని ప్రశ్నించి వెంటనే మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. డయల్ 112, శక్తి యాప్ కాల్స్ వచ్చిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, ఎటువంటి జాప్యం జరగరాదని, సౌకర్యాలు ఇంకా ఏమైనా కావాలా అని అడిగి, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహించండని హెచ్చరించారు. బీట్ వ్యవస్థ, హైవే మొబైల్, విహెచ్ఎఫ్ సెట్ మానిటరింగ్ లను పరిశీలించారు. సమయపాలన పాటించాలని, విధులలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. కంట్రోల్ రూమ్ వ్యవస్థ పనితీరు బాగుందని, పరిసరాలు శుభ్రంగా ఉన్నాయని అభినందించారు. ఈ సందర్శనలో యస్.పి. వెంట అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య, ఏఆర్‌డిఎస్పి చంద్రమోహన్, ఆర్ఐ వెల్ఫేర్ రాజారావు, ఆర్ఐఎంటి హరిబాబు, పిసిఆర్ సిఐ భక్తవత్సల రెడ్డి, పిసిఆర్ ఎస్ఐ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

# దుకాణాలకు అద్దె బకాయిల నోటీసులు



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక స్టోన్ హౌస్ పేట కన్యకా పరమేశ్వరి దేవాలయం సమీపంలోని కేపీసీ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందు దుకాణాలను కమిషనర్ గురువారం తనిఖీ చేశారు. దుకాణాల నిర్వాహకులు అద్దె బకాయిలను నోటీసులలో పేర్కొన్న సమయంలోపు చెల్లించాలని, లేనిపక్షంలో దుకాణాలను జప్తు చేసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. కేటాయించిన మున్సిపల్ దుకాణాలను నిర్వాహకులు యధా స్థితిలో ఉంచి వ్యాపార లావాదేవీలు నిర్వహించుకోవాలని, దుకాణాలలో ఇతర అదనపు నిర్మాణాలు, మరమ్మతుల కోసం నిర్మాణాల తొలగింపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని కమిషనర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మృతుల కుటుంబానికి పరామర్శ



**ఇందుకూరుపేట, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** ఇందుకూరుపేట అరుంధతి వాడలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన చల్లగుండ్ల శ్రీనివాసులు, లక్ష్మీ దంపతుల మృతదేహాలకు పూలమాల వేసి టీడీపీ మండల అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్‌రెడ్డి గురువారం నివాళులర్పించారు. మృతుల కుమార్తె లక్ష్మీ చందు, కుమారుడు విశ్వంత్‌లను ఓదార్చి స్థానిక శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈదురు విజయ కుమార్, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సమన్వయ కృషితోనే గ్రామాల అభివృద్ధి కలెక్టర్ - హిమాన్షు శుక్లా



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయ కృషితోనే గ్రామాల అభివృద్ధి, తద్వారా జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. గురువారం కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ చాంబర్లో డిఆర్డిఏ, డ్వామా, పంచాయతీ, ఆర్డబ్ల్యుఎస్ పంచాయతీరాజ్ శాఖల సమీక్ష సమావేశం ను జిల్లా కలెక్టర్ నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రకాల కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, వాటిని సక్రమంగా అమలు చేసి అన్ని విభాగాల్లో జిల్లాను ముందంజలో ఉంచేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు అన్నివేళలా అందిస్తామన్నారు. వివిధ రకాల కార్యక్రమాల ప్రతిపాదనల తయారీకి ముందే ఆయా స్టేట్ హోల్డర్స్‌తో చర్చించిన అనంతరమే ప్రతిపాదించాలన్నారు. అలాగే పంచాయతీలలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించుటలో ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్, కిచెన్ గార్డెన్స్, ఇంటింటి చెత్త సేకరణ, గ్రీన్ అంబాసిడర్స్, ఆరోగ్యకరమైన జీవన విధానం ప్రోత్సహించటం తదితరాల గురించి దిశా నిర్దేశం చేశారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలలో మ్యాజిక్ డ్రైన్స్ నిర్మించేందుకు నాలుగు గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలోని బిసి, ఎస్ సి, ఎస్ టి సంక్షేమ హాస్టల్స్‌లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా మరుగుదొడ్ల నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ, డ్వామా పిడిలు నాగరాజ కుమారి, గంగాభవాని, డిపిఒ శ్రీధర్ రెడ్డి, జడ్పీ సీఈవో మోహన్ రావు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ లు కోటేశ్వరరావు, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలపై గత ప్రభుత్వం పెట్టిన కేసులను ఎత్తివేయాలి

## అసెంబ్లీలో కోవూరు ఎమ్మెల్యే



**కోవూరు, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** అంగన్‌వాడీలు అంటే అమ్మలా సేవలు అందించే వారని అటువంటి వారిపై గత ప్రభుత్వ హయాంలో పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం శాసనసభ తొలిరోజు సమావేశం సందర్భంగా ఆమె అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై గళం విప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ప్రథమ గురువుగా బాధ్యతలు నెరవేరుస్తున్న అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. ఫేస్ యాప్, ఇన్ అవుట్ లొకేషన్ విధానంలో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సందర్భంగా ఆమె సభ దృష్టికి తీసుకువచ్చారు. అంగన్‌వాడీల సంక్షేమం కోసం 4200 రూపాయలు ఉన్న జీతాన్ని ఒక్కసారిగా 10,500కు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన జీవో నెం 116కు సంబంధించి రాష్ట్రంలో ఉన్న మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు కొత్తగా 4687 హెల్పర్ల నియామకానికి ప్రభుత్వం అనుమతిచ్చిందని, ఇందుకు ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. నెల్లూరు జిల్లాలో గిరిజనులు ఎక్కువగా నివశించేది కోవూరు నియోజకవర్గంలోనే అని , 138 గిరిజన కాలనీల్లో దాదాపు 35 వేల మంది గిరిజనులు నివశిస్తున్నారన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో 407 అంగన్‌వాడీ కేంద్రాలు ఉంటే వాటిలో 217 అంగన్‌వాడీ కేంద్రాలు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. 115 సెంటర్లు అద్దె భవనాల్లో ఉన్నాయని, మరో 80 కేంద్రాలు కొన్ని ప్రభుత్వ భవనాల్లో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారన్నారు. అద్దె భవనాల్లో ఉంటున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసి ఉన్న భవనాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మహిళా సంక్షేమ శాఖ మంత్రికి ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

# రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సమావేశం

- ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు
- కొత్త బీఎల్ఓలకు త్వరలో శిక్షణ
- సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు



**నెల్లూరు అగ్రికల్చర్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** రూరల్ నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందని నెల్లూరు ఆర్డీవో ఎన్ఎస్ అనూష తెలిపారు. ఆర్డీవో తన ఛాంబర్‌లో గురువార నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక జనాభా కలిగి కొంత మేరకు సమస్యాత్మక నియోజకవర్గంగా ఉన్న రూరల్ నియోజకవర్గంలో అందుకు అనుగుణమైన ఎన్నికల నిర్వహణకు సమాయత్వం అయ్యేందుకు సాధారణంగా సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ఓటర్ల ప్రాతిపదికన 58 పోలింగ్ స్టేషన్లను మార్పు చేయడం జరిగిందని వివరించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 287 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అందుకు అనుగుణంగా బీఎల్ఓల నియామకం కొత్తగా చేపట్టామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓటర్ల జాబితాలను అందించామని తెలిపారు. నియోజకవర్గంలో 100 సంవత్సరాలకు పైబడిన ఓటర్లు కూడా ఉన్న నేపధ్యంలో వారు ఓటు హక్కు వినియోగించు కోవడం కోసం ఇబ్బందులు లేకుండా రాజకీయ పార్టీల ప్రతినిధులను సహకరించాలని కోరామ న్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 89 వేల ఓటర్ కార్డులను పంపిణీ చేశామని చెప్పారు. ఫామ్ 6, ఫామ్ 7 తదితర సమస్యలన్నీ పరిష్కరిం చామని అధికారులను ఆదేశించామన్నారు. వచ్చే వారంలో రాజకీయ ప్రతినిధుల సమక్షంలో బీఎల్ఓలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి నేతల అనుమానాలు నివృత్తి చేసుకునేలా చర్యలు చేపట్టామన్నారు. కొత్తగా నియమించిన బీఎల్ఓలకు శిక్షణ అందిస్తామని తెలిపారు. ఏది ఏమైనా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జమీర్ భాష, ఏవో నిర్మలానంద బాబా, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.


# పి జి ఆర్ ఎస్ అర్జీల పరిశీలనలో కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్న ఫిర్యాదు పై స్థానిక 22వ డివిజన్ వేదయపాలెం ప్రాంతంలోని సప్తగిరి లేఅవుట్ కు సంబంధించి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు గురువారం వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. డివిజన్ పరిధిలో ఆస్తి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు, తాగునీటి కొళాయి, డ్రైనేజీ పన్నులను క్రమం తప్పకుండా వసూలు చేసి, నిర్దేశించిన లక్ష్యాలను 100 సాధించాలని రెవెన్యూ విభాగం అధికారులు వార్డు అడ్మిన్ కార్యదర్శులను కమిషనర్ ఆదేశించారు. డివిజన్ పరిధిలో డ్రైను కాలువలు ఆక్రమణలకు గురి కాకుండా కాలువలపై మెట్లు, ర్యాంపులు, తదితర ఎలాంటి నిర్మాణాలు జరగకుండా పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణాలను తొలగించి వేస్తామని హెచ్చరికలు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. డివిజన్ పరిధిలో అపరిశుభ్రమైన వాతావరణం లో నిర్వహిస్తున్న హోటల్ ప్రాంగణాన్ని కమిషనర్ పరిశీలించి నిర్వాహకులకు 5 వేల రూపాయల జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేయకుండా శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకోవాలని, ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను ప్రజలు అందించేలా నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలలో డస్ట్ బిన్లను ఏర్పాటు చేసే బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేయకుండా అడ్డుకోవాలని సూచించారు. నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవిన్యూ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాక్టర్ వెనుకవైపు నుండి ఢీకొట్టిన టీవీఎస్

## వ్యక్తి అక్కడికక్కడే మృతి



**సంగం సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** సంగం మండలం సిద్ధీపురం వద్ద జాతీయ రహదారిపైన రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఒక వ్యక్తి టివిఎస్ వాహనంపైన వస్తు ట్రాక్టర్ వెనుకవైపు వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి కొండాపురం మండలానికి చెందిన మర్రిగుంట గ్రామం అని తెలిసింది. ఆయన పౌరోహిత్యం చేస్తారని తెలిసింది. నారాంపేటలో పూజలు చేసుకొని నెల్లూరు దగ్గర నారాయణరెడ్డిపేటకు వెళ్ళే గ్రామంలో ఆగివున్న ట్రాక్టర్‌ని వెనుక వైపు నుండి ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




# చుండిలో భూసార పరీక్షలపై అవగాహన



**వలేటివారిపాలెం సెప్టెంబరు 18, ప్రభాతవార్త** భూసారవంతంపై అవగాహన తో వ్యవసాయం చేయాలని కందుకూరు కృషివిజ్ఞానకేంద్రం సాంకేతిక నిపుణుడు వివేక్‌కుమార్ రైతులకు సూచించారు. తద్వారా రైతులకు లాభం చేకూరుతుందని ఆయన అన్నారు. గురువారం మండలంలోని చుండి మోడల్ స్కూలులో భూసార పరీక్షలపై విద్యార్థులతోపాటు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక వ్యవసాయాధికారి కె.వి శేషారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివేక్‌కుమార్‌తోపాటు లింగసముద్రం ఏవో సిహెచ్‌విఎల్ దుర్గ, కందుకూరు భూసారపరీక్షాకేంద్రం అధికారి గీతా ప్రకాష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టినమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహిస్తే నేల స్వభావంతోపాటు భూమిలో గల పోషకవిలువల పరిమాణం తెలుస్తుందన్నారు. తద్వారా దృష్ట్యా ఏ పంట వేయాలో, ఏమందులు వాడాలో ఇందుకు ఏ పద్ధతులు వినియోగించాలో తెలుస్తుందన్నారు. తద్వారా అనవసర మందులు, ఎరువుల వినియోగం తగ్గించవచ్చన్నారు. దీంతో రైతులుకు మేలు చేకూరుతుందన్నారు. భూసార పరీక్షల నిర్వహణపై విదివిదానలను వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో మట్టినమూనాలు సేకరణ, భూసార పరీక్షలు, పంటమార్పిడి తదితర సాంకేతికపద్ధతులను విద్యార్థులకు సైతం అవగాహన కల్పిస్తున్నట్లు శేషారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పటమట వెంకటేశ్వరన్‌తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఉదయగిరి ఉప ఖజానా కార్యాలయం తనిఖీ



**ఉదయగిరి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** ఉదయగిరి ఉప ఖజానా కార్యాలయాన్ని జిల్లా ఖజానా డిప్యూటీ డైరక్టర్ డి.గంగాద్రి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. రికార్డులు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సకాలంలో సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఓ సబ్ ట్రెజరీ అధికారి ఉస్మాన్, సీనియర్ అసిస్టెంట్లు ఎం.శ్రీనివాసులు, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చక్కర,కొవ్వువున్న నూనెలు తగ్గించాలి పిల్లలకు వ్యాయామం చాలా కీలకం



**బుచ్చి సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని బెస్తపాళెం అంగన్‌వాడీ సెంటర్, బుచ్చి బిసి సెంటర్, బుచ్చి ఎడబ్ల్యూ, బుచ్చి హెచ్‌డబ్ల్యూ సెంటర్‌లకు సంబందించి 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. సూపర్‌వైజర్ డి.పద్మావతి నేతృత్వంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించారు.ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లులకు,బాలింతలకు పలు సూచనలు చేశారు. చిన్నతనంలోనే పిల్లలు అధిక బరువు, కొలస్ట్రాల్ ఉంటే వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాల్సి ఉంటుందని అన్నారు. పిల్లలు నిత్యం వ్యాయం చేసే విధంగా తల్లులు శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రధానంగా చక్కర, అధిక ఉప్పు,నూనె తగ్గించాలని, వ్యాయామం చేయాలని అన్నారు.ఈ సందర్భంగా స్టాల్స్‌లో తక్కువ ధరతో ఎలా పౌష్టికాహారం తయారు చేసుకోవాలి,ఇండ్ల వద్ద దొరికే ఆకుకూరలు గురించి పూర్తి స్థాయిలో వివరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సిందూర, పి.సుమలత, బి.వాసవి, కె సుబ్బమ్మ,ఎఎన్‌ఎం ప్రసన్న, ఆశావర్కర్ శ్రీదేవి, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోవూరు ఐసీడీఎస్ సీడీపీవో శారద తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీ అట్ల కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కేంద్రంలో చిన్నారులకు ప్రభుత్వం అందించే బలవర్థకమైన పౌష్టికాహారం అందించడమే కాకుండా ప్రతి నెల 10వ తేదిలోగా వారి యొక్క బరువు ఎత్తు తూచి యాప్‌లో నమోదు చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భవతులు, బాలింతలకు క్రమం తప్పకుండా ఇళ్లకు వెళ్లి యాప్‌లో నమోదు చేసి పౌష్టికాహారాన్ని అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

## ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా..!



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** సంగం మండలం పెరుమన వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురి కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు నగర 16వ డివిజన్ గుర్రాలమడుగు సంగంలో మృతుల పార్థివదేహాలకు నివాళులర్పించిన ఆయన, బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు నగర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కూడా కుటుంబాలకు అండగా నిలిచారు. కాకాణి మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల మౌనమే ప్రాణనష్టం పెరుగడానికి కారణమని ఆరోపించారు. అధిక లోడుతో ఇసుక తరలిస్తున్న ట్రిప్పర్ రాంగ్ రూటులో విపరీత వేగంతో దూసుకురావడంతోనే ఈ ప్రమాదం సంభవించిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇసుక మాఫియాపై పోలీసులు చర్యలు తీసుకోకుండా, అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు లోనవుతూ కేసులను నీరుగార్చేస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి దారుణాలు పునరావృతం కాకుండా అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణాపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ఎస్పీని ఆయన డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణమైన వాహన యజమానులు, ఇసుక తరలింపులో పాలుపంచుకున్న వారిపై కూడా కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందని ఆయన హితవు పలికారు. ఒక్కొక్క కుటుంబానికి ప్రభుత్వం తరఫున 25 లక్షలు, ప్రమాదానికి కారణమైన వారినుంచి మరో 25 లక్షలు చెల్లింపజేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలు కన్నీటి మునిగితేలుతున్న పరిస్థితిని చూసి మనసు కలచివేస్తుందని, ఆ కుటుంబాల పట్ల సమాజం అంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మరణించిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులు ఆ దుర్ఘటనను తట్టుకొని ముందుకు సాగాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు.

## కంటి వైద్య శిబిరం విజయవంతం



**కోవూరు, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆప్తమాలజిస్ట్ లక్ష్మీప్రసూన ఆధ్వర్యంలో 175 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారికి తగు సలహాలు, సూచనలు చేవారు. ఈకార్యక్రమాన్ని మండల పరిషత్ అధ్యక్షురాలు టి. పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు ఎలత, మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డిలు పరిశీలించి వైద్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చైతన్య, నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నిరంజన్, డాక్టర్ ఇర్ఫాన్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా అన్నదానం



**కోవూరు,సెప్టెంబరు18 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో వెలసి ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ప్రాతఃకాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా దాసరి హిమవతి, కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కమిషనర్ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో అర్జీలపై పరిష్కారం



**నెల్లూరు కార్పొరేషన్,సెప్టెంబర్ 18,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై ఓ నందన్ స్వయంగా వెళ్ళి ప్రజా సమస్యల పరి ష్కార వేదికలో అందుకున్న సమస్యను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు స్థానిక గుడిపల్లిపాడు ప్రాంతంలోని కమ్యూనిటీ హాల్ ను అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. సమస్యకు సంబంధించి పూర్తిస్థాయిల విచారించి శాశ్వత పరిష్కారం అందించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ గ్రామ కమిటీ ప్రత్యేక సమావేశం



**పాటూరు( కోవూరు,) సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు గ్రామంలో గురువారం వైసీపీ పార్టీ గ్రామ కమిటీ సమావేశాన్ని మాజీ మంత్రి, రాష్ట్ర పీఏసీ సభ్యులు ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల పార్టీ అధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ఏ సమస్య వచ్చినా అందరూ కలిసి కట్టుగా ఎదుర్కోవాలన్నారు. దీని ద్వారా గ్రామంలోని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు భరోసా కల్పించేవారమవుతామన్నారు. ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు విజయసేనారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఆదినారాయణరెడ్డి, సుబ్బరాయుడు, మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, తదితరులు ఉన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన డ్రైనేజిలు పూడికతీత

**బుచ్చి సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం ముంబాయిరోడ్డుకి ఇరువైపులా డ్రైనేజి పూడికతీత ముమ్మరంగా చేస్తున్నారు.అనేక సంవత్సరాలుగా డ్రైన్లు పూడిక తీయనందున రోబోలు తీసేకొద్ది పూడిక మట్టి వస్తుంది.డ్రైనేజిలు ప్రతి 6 నెలల కొకసారి తీస్తు వుంటే ఇంతటి పరిస్థితి వచ్చివుండేది కాదు అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.కమీషనర్ బాలకృష్ణ పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తు పూడిక తీత పనులు చేయిస్తున్నారు.4 రోబోలు, 3 జెసిబిలు గత నాలుగు రోజుల నుండి దక్షణం వైపు చేస్తున్నాయి. మరో రెండురోజులు దక్షణ వైపు పూర్తి అయితే ఉత్తరం వైపు వున్న డ్రైనేజి పూడికతీత పనులు ప్రారంభిస్తారు. అయితే ఈ పూడికతీతకు వరుణదేవుడు కూడా కరుణించాడని చెప్పవచ్చు. మున్సిఫల్ సిబ్బంది కూడా పూర్తి స్థాయిలో కష్టపడుతున్నారు.

## మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించిన జూపూడి



**కావలి, సెప్టెంబర్18, ప్రభాతవార్త:** కావలి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను గురువారం కావలిలో వారి స్వగృహం నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకర్ పరామ ర్శించి జరిగిన విషయాలను తెలుసుకోవడం జరిగింది. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరారు.అనంతరం జూపూడి ప్రభాకర్ మాట్లాడారు రాష్ట్రంలో జరుగుతున్న కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న పి4 విధానాన్ని సున్నితంగా తిరస్కరించారు, పదవులు ఎవరికి శాశ్వతం కాదని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఏ ప్రభుత్వమైనా పనిచేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కావలి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, జిల్లా ఎస్సీ ఎల్ అధ్యక్షులు పందిటి కామరాజు, జిల్లా వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు కనమర్లపూడి వెంకటనారాయణ, మాజీ కౌన్సిలర్లు కనపర్తి రాజశేఖర్, షేక్ షాహుల్ , శ్రీనివాసులు రెడ్డి, చిన్న పుల్లయ్య,మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## రేషన్ బియ్యంలో ఉన్న పోషక విలువలపై అవగాహన కల్పించాలి



**కోవూరు, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేసే బియ్యంలో బలవర్థకమైన పోషకాహారాలు ఉన్నాయని, వాటిపై కార్డుదారులకు అవగాహన కల్పించేలా డీలర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన చౌక డిపో డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యంలో ఉండే పోషక పదార్థాలను కడిగి బయట పారవేస్తున్నారన్నారు. ఈ బియ్యంలో ఫోలిక్ యాసిడ్, ఐరన్ సంబంధించిన పదార్థాలు ఉన్నాయని, వాటిని సక్రమంగా ఉపయోగంచుకుంటే పౌష్టికాహారలోపం తలెత్తే పరిస్థితి ఉండదన్నారు. అదేవిధంగా ప్రస్తుతం డీలర్లకు నూతనంగా ఈ పాస్ మిషన్లు అందజేయడం జరిగిందని, అక్టోబర్ నెల నుంచి వాటిని ఉపయోగించుకునేలా చూడాలన్నారు. ప్రతి నెల 30వ తేదిలోగా ముందుగా 60 సంవత్సరాలు దాటిన వృద్ధులకు బియ్యం పంపిణీ ఇంటి వద్దనే పూర్తిచేయాలన్నారు. ప్రతి నెల 1 నుంచి 15 వరకు ప్రభుత్వం నిర్దేశించిన వేళలు పాటిస్తూ సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ బాలకోటమ్మ డీలర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్, డిప్యూటీ తహసీల్దార్ బషీర్, తదితరులు ఉన్నారు.

## ఘనంగా ప్రధానమంత్రి జన్మదిన వేడుకలు



**కోవూరు, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి స్వీట్లు, బ్రెడ్లు, పండ్లు రోగులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోవూరు ఇన్‌చార్జి దాసరి ప్రసాద్ మాట్లాడుతూ మోడీ కారణంగా ప్రపంచమంతా భారతదేశం వైపు చూస్తుందన్నారు. అటువంటి వ్యక్తి మన దేశానికి ప్రధాని కావడం ప్రజలు చేసుకున్న అదృష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల మత్తులో పడవద్దు





**కోవూరు, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** యువత మాదకద్రవ్యాల మత్తులో పడి తమ భావి జీవితాన్ని నాశనం చేసుకోకూడదని సెట్నల్ సీఈవో బి. శ్రీనివాసరావు తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ నేతాజీనగర్‌లో ఉన్న వైకేఆర్అండ్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల జోలికి వెళ్తే వారి జీవితంతో పాటు వారి కుటుంబం కూడా పూర్తిగా చిన్నాభిన్నం అయిపోతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని భావిభారత పౌరులైన యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా తమ భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఏ. మహేంద్రరెడ్డి, జిల్లా ఈగల్ సెల్ ఆఫీసర్ ఫిరోజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన, వైస్ ప్రిన్సిపాల్ రామ్‌ప్రసాద్, డాక్టర్ ఎస్. రామాంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్యామల కుమార్‌లు పలు సూచనలు చేశారు.

## రూ. కోటి 50 లక్షలతో విద్యుత్ సమస్యల పరిష్కారానికి శరవేగంగా పనులు



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 25వ డివిజన్ బుజబుజనెల్లూరులో విద్యుత్‌లో వోల్టేజ్, విద్యుత్ అంతరాయం సమస్యలను అధిగమించేందుకు కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న ఎలక్ట్రికల్ పనులను టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో కలిసి ఈ ఉదయం పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాలుగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు పరిష్కార దిశగా సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలోనే అభివృద్ధి, సంక్షేమం రెండూ సమాంతరంగా సాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కృషి వల్లనే ఈ పనులు వేగవంతంగా సాగుతున్నాయని గిరిధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరిన ఆయన, సంవత్సర కాలంలోనే మంచి పాలనను అందించిన ఈ ప్రభుత్వం అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెన్నీ రమణయ్య, స్థానిక కార్పొరేటర్ బద్దెపూడి నరసింహాగిరి, 25వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు శేషు యాదవ్, రాష్ట్ర ఎస్సి సెల్ ప్రతినిధి మాతంగి కృష్ణ, నాయకులు నగళ్ళ రాము, బ్రహ్మారెడ్డి, హరినాయుడు, దూడల ప్రసాదరావు, పులి నాగేశ్వరరావు, దొడ్డక రమేష్, బాలకృష్ణ యాదవ్, గుంటగాని అశోక్, రాజగోపాల్, షేక్ షబ్బీర్, ముజీర్, మణి, బి.రమేష్, అహ్మద్, మాబాషా, కదిర్, మాతంగి నరసింహులు, అంజాద్, కరీముల్లా, రాజా, ప్రసాద్, చిన్న ఆంజనేయులు, సంధాని, శ్రీనివాసరాజు, జయరామరాజు, చలమన్న, చెన్నకేశవ, గుంటి కృష్ణయ్య, బొడ్డు రాము, అరుమూల్ల నరసింహులు, వద్దినేని సురేష్, బాష్యం దామోదర్, సిద్దయ్య, మహేంద్రనాయుడు, రఫీ, హుస్సేన్, అబ్దుల్లా, నాగూరబీ, ఇంద్రసేనమ్మ, పర్వీన్, సునానీ, జనసేన నాయకుడు కుడుముల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధిని పెంచుకోవాలి



**కోవూరు, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ పొదుపు సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పొదుపు మహిళలకు పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి పెట్టాలని వాటని అందజేస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సుబ్బరాజు అన్నారు. స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో గురువారం 140 పెరటి కోళ్ల యూనిట్లను పొదుపు గ్రూపులకు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు ఇంతా మల్లారెడ్డి మాట్లాడుతూ పొదుపు మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ పెరటి కోళ్ల పెంపకంకు శ్రీకారం చుట్టారన్నారు. కుటుంబంలో మహిళలు పటిష్టంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇటువంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం మహిళలకు 140 యూనిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు రాజశేఖర్, రాము, మురళి, శోభ, పొదుపు మహిళలు ఉన్నారు.

## విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన



**బుచ్చి సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం రామచంద్రాపురం గ్రామంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఆవరణంలో విద్యార్థిని విద్యార్థులకు భూసార పరీక్షల మీద శిక్షణా కార్యక్రమం మండల వ్యవసాయాధికారి ఎన్ శ్రీహరి ఆద్వర్యంలో నిర్వహించారు. ఏడిఏ దేవసేన ఈ సందర్భంగా మాట్లాడుతు పంటకు అవసరమైన పోషకాల గురించి వివరిస్తు వాటి యొక్క ఉపయోగాల గురించి తెలియజేశారు. విద్యార్థులందరు కూడా వారి యొక్క తల్లిదండ్రులకు వ్యవసాయం చేసేటప్పుడు తప్పని సరిగా భూసారా పరీక్షా ఫలితాలు ఆధారంగా మాత్రమే ఎరువులను వాడాలని తెలియజేయాలని చెప్పారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త అనూషా మాట్లాడుతు మట్టిలో ఉన్నటువంటి రకాల గురించి మరియు వివిధ రకాల మట్టి యొక్క బౌతిక స్దితుల గురించి వివరిస్తు వాటి యొక్క నమూనాలను చూపించడం జరిగింది. భూసారా పరీక్ష కేంద్రం నెల్లూరు వ్యవసాయ అధికారిని కళ్యాణి మాట్లాడుతు మట్టి పరీక్షలు చేసే విధానం గురించి వివరిస్తు మట్టిలో ఉన్నటువంటి ఈ పోషకాల ఆధారంగా వాటి యొక్క నాణ్యతా ప్రమాణాలను గురించి తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పి శ్రీలక్ష్మీ, గ్రామ వ్యవసాయ సహాయకులు వి.వెంకట ప్రసాద్ పాల్గోన్నారు.

## మంచి ఆహారం ద్వారా మంచి ఆరోగ్యం



**గిలకపాడు(రాపూరు),సెప్టంబరు18ప్రభాతవార్త :** మంచి ఆహారం తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.వి.సూర్యధర్మేంద్ర తెలిపారు. వేపినాపి సెక్టార్ ఐసిడిఎస్ సూపర్ వైజర్ సౌజన్య ఆధ్వర్యంలో గురువారం గిలకపాడు సచివాలయం పరిధిలోని అంగన్ వాడీ కేంద్రాలలో రాష్ట్రీయ పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పంపిణీ చేసే పౌష్టికాహారంలో మంచి పోషక విలువలు వుంటాయాని ఆ ఆహార పదర్దాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సౌజన్య సుమతమ్మ,పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు వున్నారు.

## పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ



**కావలి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:** కావలి పట్టణం నివాసులు స్వర్గీయ కందికట్టు కోటేశ్వరరావు16వ వర్థంతి సందర్భంగా వారి తమ్ముడు,మరదలు పాత్రికేయులు కందికట్టు.నారాయణ, శ్యామల సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా కావలి పట్టణం తుఫాన్ నగర్లోని పేదలకు గురువారం భోజనం ప్యాకెట్లు వితరణ చేయించడం జరిగింది.ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడారు పాత్రికేయులు కందికట్టు నారాయణ వారి అన్న జ్ఞాపకార్థంగా గత కొన్ని సంవత్సరాలుగా తమ యొక్క సంస్థ ద్వారా పేదలకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ ద్వారా పేదలకు ఆకలి తీరుస్తున్న దాతలు కందికట్టు నారాయణ శ్యామల దంపతులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నామని తెలిపారు. అలాగే వారి అన్నయ్య స్వర్గీయ కోటేశ్వరరావు పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ ఉన్నామని తెలిపారు.

## మహిళలు ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



**కోవూరు, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** కుటుంబాన్ని మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబాన్ని సక్రమ మార్గంలో నడిపించగలదని మండల పరిషత్ అధ్యక్షురాలు టి. పార్వతి అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 20 మంది వైద్యులతో పెద్ద ఎత్తున వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఇటువంటి కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వ సాకారంతో రూపొందిస్తున్నారన్నారు. వీటిని ప్రతి మహిళ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ 17వ తేది నుంచి అక్టోబర్ 2వ తేది వరకు మహిళల కోసం ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య నిపుణులచే శిబిరాలను నిర్వహిస్తున్నారని, వీటిని మహిళలు పూర్తిస్థాయిలో ఉపయోగి ంచుకో వాలన్నారు. సీడీపీవో శారద మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భవతులకు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలోకోవూరు ఐసీడీఎస్ సీడీపీవో శారద వైద్యులు డాక్టర్ నిరంజన్, డాక్టర్ ఇర్ఫాన్, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, పలు సూచనలు చేశారు. అనంతరం మహిళల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 20 మంది వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యులు కరుణాకర్, నాగేశ్వరరావు, చైతన్య, తదితరులు ఉన్నారు.

## అల్లూరు బార్ డిప్‌లో కైవసం



**కోవూరు, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :** కోవూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని అల్లూరులో గురువారం నిర్వహించిన లక్కీ డిప్‌లో జి. రామ్మూర్తి పేరు రావడం జరిగిందని ఎక్సైజ్ సీఐ కిషోర్ తెలిపారు. ఈ మేరకు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ మొత్తం ఈ బార్‌కు 4 దరఖాస్తులు రాగా.. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో తీసిన లక్కీ డిప్‌లో జి. రామ్మూర్తికి వచ్చిందన్నారు.అదేవిధంగా కోవూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని యల్లాయపాలెం గ్రామంలోని దాసరిపాలెం బస్‌షెల్టర్ వద్ద 7 మద్యం సీసాలు అక్రమంగా కలిగి ఉన్న జి. మహేంద్రను అరెస్టు చేసి అతని వద్ద నుంచి మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

## ప్రధాని నరేంద్రమోడీ జన్మదిన వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరం




**నెల్లూరు అగ్రికల్చర్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవంలో భాగంగా భారతీయ జనతా పార్టీ శ్రేణులు నెల్లూరులో గురువారం రక్తదాన శిబిరం నిర్వహి ంచారు. నగరంలోని స్టోన్ హౌస్ పేటలో 6,7,8, 9,10 వార్డుల కార్యకర్తలు ఈ రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో భారీగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి, ప్రధాని మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నేతలు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పరిపాలనలో దేశంలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. ప్రధాని ప్రజోపయోగ కార్యక్రమాలను ఎన్నో ప్రవేశపెట్టి, సుపరిపాలనను అందిస్తున్నారని వివరించారు. ప్రస్తుతం అనేక వస్తువులపై జీఎస్టీని తగ్గించి, నిత్యవసర వస్తువులు సైతం తక్కువ ధరకు అందేలా కృషి చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మేడేపల్లి రత్నం నాయుడు, పైడిమాని సుజన, ముక్కు రాదయ్యా, పైడిమాని ఆదినారాయణ, బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కరణం సుభాషిణి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వి.హర్షవర్ధన్, గాదంశెట్టి సురేష్‌బాబు, ప్రియా, బాలకృష్ణ నాయుడు, కోటేశ్వరరావు, ఎల్.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెరమన రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు అండగా నిలిచిన ప్రభుత్వం



**నెల్లూరు,సెప్టెంబర్18,ప్రభాతవార్త వైద్యం:** పెరమన రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. బుధవారం టిప్పర్– కారు ఢీకొని ఏడుగురు మృతి చెందిన ఘటనను సీఎం దృష్టికి తీసుకెళ్లిన మంత్రి నారాయణ. ఘటన జరిగిన విధా నాన్ని సీఎంకు వివరించిన మంత్రి. మంత్రి నారాయణ చొరువతో ఒక్కో కుటుంబానికి రూ.5లక్షలు ఆర్థిక సాయం ప్రకటించిన ప్రభుత్వం.

## ఉత్తర క్రియలకు హాజరైన విజయభాస్కర్‌రెడ్డి



**నెల్లూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త –వైద్యం :** నగరంలోని మైపాడు రోడ్డు, కిసాన్ నగర్ కు చెందిన తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పోరెడ్డి సాయిబాబా రెడ్డి తల్లి పోరెడ్డి వెంకటమ్మ ఇటీవల స్వర్గస్తులైన విషయంతెలుసుకున్న నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కం రెడ్డి గురువారం ఆమె ఉత్తర క్రియలకు హాజంయ్యారు. ఈ సందర్భంగా వెంకటమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లి లేని లోటు తీర్చలేనిదని ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పోరెడ్డి సాయిబాబారెడ్డికి ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించండి



**చేజర్ల సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో ఎనిమిదోవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు నిర్వహించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్య తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భవతులకు బాలింతలకు పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. పోషణ వల్ల విద్య పిల్లల శారీరక మానసిక అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.తల్లిపాలు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని తెలియజేశారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణపై అవగాహన కల్పించడం వలన ఆరోగ్య కరమైన సమాజం సాకారం అవుతుందని పేర్కున్నారు.

ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## అప్పసముద్రం ఘటనపై స్పందించిన సీఎం చంద్రబాబు తక్షణ సాయం అందజేత



**ఉదయగిరి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని అప్పసముద్రం గ్రామంలో ఇటీవల వినాయక చవితి నిమజ్జన కార్యక్రమంలో చోటు చేసుకున్న విషాధకర ఘటనలో బాణసంచా పేలుడూ కారణంగా తొమ్మిది మంది చిన్నారులు తీవ్ర గాయాలకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనను ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి, బాధిత చిన్నారుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు. దీని ఫలితంగా బాధత చిన్నారులందరికి ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున ఆర్థిక సహాయం చెక్కులను ఈ రోజు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డితో కలిసి పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు వైద్య అవసరాల విషయంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఎల్లప్పుడూ చిన్నారులకు భవిష్యత్తులో వైద్య అవసరాలు, ప్లాస్టిక్ సర్జరీ అవసరమైతే ప్రభుత్వం తరుపున తాను పూర్తి స్థాయిలో సహకరిస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హామీ ఇచ్చారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటుందని, అలాగే సంబంధిత అధికారులకు భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా చూసే విధంగా కఠిన నిబంధనలు చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాలలో జరిగే ఉత్సవాలలో వేడుకలలో తల్లిదండ్రులు, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి పిల్లలు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అది మనందరి బాధ్యత అని అన్నారు. అలాగే గాయపడిన పిల్లల వైద్య చికిత్స కోసం ఎటువంటి భారం పడకుండా ప్రభుత్వం ఎల్లప్పుడూ బాధిత కుటుంబాల వెన్నంటి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సీతారామపురం బిట్-2లో పోషణ మహోత్సవం



**సీతారామపురం సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన సీతారామపురంలోని బిట్ -2 గ్రామ సచివాలయంలో గురువారం పోషణ మహోత్సవం కార్యక్రమాన్ని ఉదయగిరి సిడిపిఒ వై.పుణ్యవతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతుపోషకాహార ప్రాముఖ్యతపై తల్లులు, గర్భిణిలు, బాలింతలకు సమగ్రంగా వివరించారు. సరైన పోషకాహారం తీసుకోకపోతే అనారోగ్య సమస్యలు వస్తాయని అన్నారు. పిల్లలలో స్థూల కాయ నివారణకు చక్కర,నూనెల వాడకం తగ్గించాలని బాల్య దశలో సంరక్షణ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార తయారిపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ స్వప్నరెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు షేక్,షాను, రత్తమ్మ, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశావాలింటిరీలు తదితరులు పాల్గొన్నారు.

## శేషు స్కూల్ విద్యార్థుల విజ్ఞాన యాత్ర



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ బుజబుజనెల్లూరులోని శేషు స్కూల్ విద్యార్థులు చెముడుగుంటలోని సి.వి. రామన్ సైన్స్ సెంటర్‌ను సందర్శించి శాస్త్ర విజ్ఞానాన్ని అనుభవించారు. అక్కడ ప్రదర్శనలో ఉన్న పిఎస్ఎల్‌వి, జిఎస్ఎల్‌వి రాకెట్ నమూనాలు, డిఎన్ఏ మోడల్, అనిమోమీటర్, సన్ దయల్, అనంతబావి, వ్రేలాడే బ్రిడ్జి వంటి భౌతిక శాస్త్ర నమూనాలు విద్యార్థులను ఆకర్షించాయి. సైన్స్ సెంటర్ సిబ్బంది ప్రతి మోడల్‌ను చిన్నారులకు అర్థమయ్యే విధంగా సమగ్రంగా వివరించగా, విద్యార్థులు ఉత్సాహంగా ప్రశ్నలు అడిగి మరింత అవగాహన పెంచుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ శేషు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థికి సైన్స్ పై అవగాహన ఉండాలి. శాస్త్రం కేవలం పుస్తకాలలోని పాఠాల వరకే పరిమితం కాకుండా, మన దైనందిన జీవితానికి అనుసంధానమై ఉంటుంది. ఇలాంటి విజ్ఞాన యాత్రల ద్వారా విద్యార్థుల్లో ప్రయోగాత్మక ఆలోచన శక్తి పెరుగుతుంది. ఇది భవిష్యత్తులో సరికొత్త ఆవిష్కరణలకు దారి తీస్తుంది. ప్రతి ఒక్క విద్యార్థి మహానుభావులు అయిన సి.వి. రామన్, డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాంని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలి అని పేర్కొన్నారు. ఈ సందర్శన విద్యార్థుల్లో శాస్త్రంపై మక్కువ పెంచడమే కాకుండా, జ్ఞానాన్ని ఆచరణలోకి తేవాలనే ఉత్సాహాన్ని కలిగించిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు కరస్పాండెంట్ శేషు, టిప్పు, గయాజ్ ఖాన్, రాము, శశికళారెడ్డి, సురేఖ, మల్లీశ్వరి పాల్గొన్నారు.

## ఏఎస్‌పేటలో గంధమహోత్సవం జరుగుతున్నా యధేచ్చగా మద్యం అమ్మకాలు

**ఆత్మకూరు,సెప్టెంబరు18,ప్రభాతవార్త :** శుక్రవారం ఏఎస్‌పేటలో శ్రీశ్రీశ్రీ హజరత్ నాయబ్‌రసూల్ స్వామి వారి గంధమహోత్సవం జరుగుతున్నా మద్యం షాపులు మాత్రం బార్లగా తెరిసి మద్యం విక్రయాలు జరుపుతున్నారు. గతంలో అయితే చిన్న గంధానికి కాని , ఒకరోజు పెద్ద గంధానికి గాని మూడురోజులు ఈమద్యం షాపు బంద్ ఉండేది. కానీ నేడు దానికి భిన్నంగా మద్యం షాపులు ప్రవేట్‌వి అయినందున బారులుగా తెరిచి అమ్మకాలు జరుపుతున్నారు. ఎందుకంటే అవి ప్రవేటు మద్యం షాపులు కావున వారికి మందు అమ్మేదే వాళ్ళ ధ్యేయం కావున మరీ ఎక్కువ రేటుతో కూడా ఈ గంథం సమయంలో ఎంఆర్‌పి రేట్ల కన్నా ఎక్కువగా అమ్ముకుంటున్నారని , ఏఎస్‌పేటలో ఏ సమయంలోనైనా మందు, బీరు దొరుకుతుందని ప్రజలు చెప్పుకుంటున్నారు. ఏఎస్‌పేటలో ఆ బ్రాందీషాపు పక్కన చుట్టూ ఉండే అంగళ్ళలో బెల్ట్ షాపు లాగా పెట్టుకొని వాళ్ళు ఏ టైంలో వెళ్ళినా అమ్ముతుంటారని ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే ఈగంధానికి అయినా మూసివేయాల్సిన బ్రాందీషాపులు తెరిచి బ్రాందీ , బీరు అమ్మడాన్ని వచ్చిన యాత్రికులు భక్తులు, ప్రయాణీకులు అసహ్యించుకుంటున్నారని చాలా మంది బాధపడుతున్నారని మరి ఈ మద్యం షాపులను నియంత్రించాల్సిన అధికారులు మరి ఎక్కడున్నారో అర్థం కావడం లేదని గంధానికి వచ్చిన భక్తులు యాత్రికులు స్థానికులు ప్రజలు చర్చించుకుంటున్నారు.ఈ మద్యం తాగిన వాళ్ళ వలన చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గంధానికి వచ్చిన భక్తులు, యాత్రికులు తెలుపుతున్నారు. ఈమందును అమ్మేవాళ్ళు అమ్ముతుంటే దీన్ని నియంత్రించాల్సిన అధికారులు మాత్రం అలా కారులో వచ్చి వాళ్ళను చూసి చూడనట్లు వెళ్ళిపోతుంటారని అమాయకులైన వారిని ప్రశ్నిస్తూ బెదిరిస్తుంటారని అసలైన మందు అమ్మే దొంగలనఉ పట్టుకోరని, పట్టుకోవడం లేదని వారికి వీరికి అధికారులకు మందు అమ్మి వాళ్ళకు ఏమైనా లావాదేవీలు ఉంటాయేమోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## పొదుపు మహిళలకు కోళ్ళు పంపిణి



**బుచ్చి సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో పొదుపు సంఘాల మహిళలకు ఏపిఎం శ్రీధర్ ఆధ్వర్యంలో కోళ్ళ పంపిణి కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు,కెనరాబ్యాంకు మేనేజర్ రాజు పాల్గొని పొదుపు మహిళలకు కోళ్ళు అందజేశారు.ఈ సందర్భంగా ఎపిఎం శ్రీధర్ మాట్లాడుతు మండలంలోని పొదుపు మహిళకు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో వంద యూనిట్లు కోళ్ళను పంపిణి చేయడం జరిగిందని అన్నారు. కోళ్ళను జబ్బుల బారి నుండి కాపాడుకోవడానికి మందులు కూడా అందించామని తెలిపారు. గ్రామాల్లో ఉన్న మహిళలలో రక్తహీనతతో బాధపడుతున్నారని వారికి పౌష్టికాహారం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈకార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. కోళ్ళను పెంచుకోవడం ద్వారా వచ్చే గుడ్లను ఆహారంగా తీసుకుంటే రక్తహీనత సమస్య తగ్గుతుందని అన్నారు. మహిళలతోపాటు చిన్నారులకు కూడా కోడి గుడ్లను తినిపిస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కోళ్ళకు వేసే ఆహారంలో పలు జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. ప్రధానంగా రేషన్ బియ్యం వాడ కూడదని అన్నారు. కోళ్ళకు జొన్నలు,రాగి,సజ్జలు, వంటి ఆహారాన్ని పెట్టాలన్నారు. కోళ్ళు ,కుక్కలు పిల్లులకు దూరంగా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకో వాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో వెలుగు సిసిలు వెంకటేశ్వర్లు, హరి రంజిత్, విఒఏలు పొదుపు మహిళలు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక దందా బలులైన దళిత కుటుంబాలకు 30 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా సంగం మండలం పెరమన వద్ద జరిగిన విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన దళిత కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఒక్కొక్కరికి 30 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించాలని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కే.సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గుర్రాలమడుగు గ్రామానికి చెందిన బాలయ్య, సారమ్మ మృతదేహాలకు నివాళులర్పించిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ రెక్కాడితే డొక్కాడని పేద దళితులు అక్రమ ఇసుక మాఫియాల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని, చిన్నారులు రోడ్డున పడిన ఈ పరిస్థితి హృదయ విదారకమని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ ఇసుక రవాణా వెనక ఉన్న తోడేళ్లను వదలకుండా కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు అక్టోబర్ 15 వరకు ఇసుక త్రవ్వకాలకు నిషేధం విధించినప్పటికీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో బహిరంగంగా భారీ ట్రిప్పర్ల ద్వారా ఇసుక దందా కొనసాగుతోందని విమర్శించారు. ఈ అక్రమాలకు మామూలు మత్తో కాకుండా అధికార పార్టీ నేతల మద్దతే కారణమని, అధికార యంత్రాంగం చూసీ చూడనట్టు వ్యవహరిస్తోందని సంజయ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇలాంటి దందాల వల్ల పేద కుటుంబాలు నాశనం అవుతున్నాయని, అమాయక పిల్లల జీవన భవిష్యత్తు చిద్రమవుతోందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే ముందుకు వచ్చి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరఫున జిల్లా ఓబీసీ అధ్యక్షుడు నరేష్, అడ్వకేట్ సుధీర్ కూడా డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ శ్రేణులు మృతులకు నివాళులర్పించారు.

## ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడం దారుణం



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వైద్య విద్య పేదలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వమే మెడికల్ కాలేజీలను పూర్తి చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆమె జగన్మోహన్ రెడ్డి హయాంలో మంజూరైన 17, మెడికల్ కాలేజీలలో 7, పూర్తయ్యి, 10 నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్నాయని గుర్తు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేయడం పేద విద్యార్థుల భవిష్యత్తుకు పెద్ద దెబ్బ అవుతుందని అన్నారు. ప్రభుత్వ కాలేజీల వలన మరో 2,500 సీట్లు లభించి, పేద విద్యార్థుల కల నిజం కావాల్సిన సమయంలో, స్వార్థ ప్రయోజనాల కోసం చంద్రబాబు ప్రైవేటీకరణ వైపు మొగ్గు చూపుతున్నారని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారని, అయినా చంద్రబాబు చెవిటోడికి శంఖం ఊదినట్టే వ్యవహరిస్తున్నారని పూజిత మండిపడ్డారు.మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 19న ఛలో మెడికల్ కాలేజీ పేరుతో యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

## మహిళలు, పిల్లల శ్రేయస్సుకు అభియాన్ కార్యక్రమం



**దగదర్తి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దగదర్తి పరిధిలోని కేకేగుంట ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్(ఏఏఎం) గ్రామంలో స్వస్థ నారీ స్వసక్త పరివార్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అకిల మాట్లాడుతూ మెరుగైన వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం అన్నారు. మహిళలు, పిల్లలు శ్రేయస్సు కోసం దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. మహిళలు పలు వ్యాధులకు సంబంధించి స్క్రీనింగ్ చేసుకోవచ్చన్నారు. మహిళలు ఆరోగ్య సంరక్షణనుమెరుగుపర్చడం, మరింత మెరుగైన వైద్య సేవలు అందించి కుటుంబాలను బలోపేతం చేయడం ముఖ్య ఉద్దేశం అన్నారు. అదే విధంగా మహిళలు ఆరోగ్య కేంద్రాల్లో సేవలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అలేఖ్య, మెడికల్ ఆఫీసర్ ఎన్.కొండారెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఆర్.విజయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ కే.శాలిని, ఎంఎల్‌హెచ్‌పీ పి.గోపి రాజు, విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ ఎన్.సునీత, ఏఎన్ఎం రవణమ్మ, ఏఎన్ఎం 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు, కిషోర బాలికలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛత యొక్క ప్రాముఖ్యతను తెలియజేసిన ఎంఈఓ



**కావలి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం కట్టకింద పాలెం ఎంపీపీ పాఠశాల ను కావలి మండల విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య 2025 స్వచ్ఛత పకావ్డా కార్యక్రమములో భాగంగా గురువారం సందర్శించి స్వచ్ఛత యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి చేతులను కడుక్కోవడం నీటి సంరక్షణ గురించి విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. పాఠశాలలో అమలు కాబోతున్న ఎఫ్ ఎల్ ఎన్ మరియు టి ఎ ఆర్ ఎల్ మెటీరియల్ ను ఉపయోగించే విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడం అయినది. పాఠశాలలో డొక్కా సీతమ్మ పథకం ద్వారా విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.కె మునీర్ జాన్, ఉపాధ్యాయులు ఎ.వెంకటేశ్వర్లు, సి ఆర్.ఎం.టి ఎం.బుజ్జయ్య మరి విద్యార్థులు పాల్గొన్నారు

## పి.ఎం.ఏ.వై 2.0 ఆంగికార్ పోస్టర్ ఆవిష్కరణ



**కావలి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పి.ఎం.ఏ.వై) 2.0 హౌసింగ్ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఆంగికార్ పోస్టర్‌ను కావలి మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ జి .శ్రావణ్ కుమార్ మాట్లాడారు పి.ఎం.ఏ.వై పథకం కింద అర్హులైన నిరుపేదలకు సొంత ఇల్లు కల్పించడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలియజేశారు.ఇల్లు ప్రతి కుటుంబానికి ఒక కలని ఆ కలను సహకారం చేసుకునేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది తెలియజేశారు.కావలి పరిధిలో అనేక కుటుంబాలు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. ఆంగికార్ పోస్టర్ ద్వారా ప్రజల్లో హౌసింగ్ పథకం గురించి పూర్తి అవగాహన కలుగుతుందని, అర్హులైన వారు తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పథకం అమలులో పారదర్శకత, వేగం కోసం అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది, హౌసింగ్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## కొండాయపాలెం గ్రామ పంచాయతీ ఆఫీస్‌కు దిక్కెవరు



**ఉదయగిరి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:** ఉదయగిరి మండల పరిధిలోని కొండాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంకు దిక్కెవరు ఆ కార్యాలయంను పట్టించుకునే నాధుడే లేడా ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని, తాగుబోతులకు అడ్డాగా ఉందని ,ప్రజలు వాపోయారు. ఇది ఒక వింత అయితే దుండగులు తలుపు చెక్కలు ఎత్తుకెళ్లారు. అలాగే గ్రామస్తులు వర్షం వస్తే మేకలు గొర్రెలను లోపలికి తోల్తారు. ఇలాంటి పనుల జరగకుండా ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కల్వర్టును ఢీకొట్టిన మినీ డీజిల్ ట్యాంకర్

**వింజమూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** వింజమూరు మండలం ఊటుకూరు సమీపంలో కల్వర్టును





ఢీకొని మినీ డీజిల్ ట్యాంకర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గురువారం బద్వేల్ నుండి మినీ డీజిల్ ట్యాంకర్ మండలంలోని కస్టర్డ్ దగ్గరకు వస్తూ ఊటుకూరు సమీపంలో రాగానే ప్రమాదవశాత్తు కల్వర్టును ఢీకొనగా ట్యాంకర్ ముందుభాగం దెబ్బతినడంతో డ్రైవర్ నవీన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. మృతుడు నవీన్(24) కు భార్య పసిబిడ్డ ఉన్నారు. కలిగిరి సీఐ వెంకట నారాయణ స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు సమగ్ర సమాచారాన్ని తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## లింగసముద్రం 1వ సచివాలయంలో పోషణ మాస కార్యక్రమం



**లింగసముద్రం సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం మండల కేంద్రమైన లింగసముద్రంలోని సచివాలయం 1 లో గురువారం నిర్వహించారు. ఐవైసిఎఫ్ కార్యక్రమం నిర్వహించి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారం గురించి వివరించడం జరిగింది. పౌష్టికాహారాన్ని వండి తల్లులకు చూపించారు. సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. బాలింతలు గర్భవతులు చిన్నపిల్లలు పౌష్టికాహారం స్వీకరించాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్ర ద్వారా ఇస్తున్న పాలు గుడ్డు, నూనె, బాలామృతం వంటివి తల్లులకు, గర్భిణీలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సి హెచ్ ఓ శ్రీనివాసులు సూపర్వైజర్ రాధాదేవి అంగన్వాడీ టీచర్లు ప్రభావతి, రమాదేవి, పరిమ కృష్ణకుమారి,తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర,స్వచ్ఛంధ్రపై అవగాహన కల్పించండి

**చేజర్ల సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్రపై అధికారులు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ అమర్ గురువారం తెలిపారు.ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర ఈనెల 20 వ తేది శనివారం అన్ని గ్రామ పంచాయితీలలో నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో పర్యావరణ పచ్చదనం కోసం చెట్లు నాటాలని కోరారు. అలాగే పారిశుద్ధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈకార్యక్రమాన్ని పంచాయితీ కార్యదర్శులు ప్రజాప్రతినిధులు సమగ్రంగా నిర్వహించాలని తెలియజేశారు.

## మృతుల కుటుంబాలకు 50లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



**ఆత్మకూరు ,సెప్టెంబరు18,ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వ ధన దాహానికి రెండు దళిత కుటుంబాలు చిన్నాభిన్నమై రోడ్డున పడ్డాయని వారి ఇసుక దాహానికి రెండు కుటుంబాలకు చెందిన 7మంది మృత్యువాత పడ్డారని వారికి 50లక్షల రూపాయల వంతున ఇసుక కాంట్రాక్టర్ల ద్వారా చెల్లించేలా చూడాలని వైఎస్ఆర్‌సిపి నాయకులు డిమాండ్ చేశారు. ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా పట్టణ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి , ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షుడు నందా ఓబులేశు , శాప్ మాజీ డైరెక్టర్ కాలువ నర్సింహులు మాట్లాడుతూ జరిగిన రోడ్డు ప్రమాదం దృశ్యాలు చూస్తే హృదయవిదారకంగా ఉన్నాయని ఎలాంటి అనుమతులు లేని రీచ్‌ల నుండి ఇసుకను అక్రమంగా తరలించడం, ఇష్టారాజ్యాంగా ఇసుకను అమ్ముకోవడమే టిడిపి ప్రభుత్వం చేస్తుందన్నారు.అనధికార ఇసుక తరలింపు వాహనం ఢీకొనడంతో పరామర్శకు వస్తున్న రెండు కుటుంబాలకు చెందిన 7మంది ప్రమాదంలో మృత్యువాత పడ్డారని, ప్రభుత్వం సంబంధిత వాహన యజమాని ఇప్పటివరకు సంతాపాలతో కాలం వెళ్ళ తీస్తున్నారని ఆ కుటుంబాల భవిష్యత్తు కోసం 50లక్షల రూపాయల వంతున చెల్లించాలన్నారు. ఆకుటుంబాల్లో అర్హత ఉన్న వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఇంత ఇసుక అక్రమ దందా జరుగుతున్నా సంబంధిత అధికారులు మామూళ్ళ మత్తులో జోగుతున్నారన్నారు. ఈ మాఫియాకు అమాయకులైన ప్రజలు బలవుతున్నారని ఇకనైనా కూటమి ప్రభుత్వ రంగంలోకి దిగి తగువైన చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది మర్రిపాడు వద్దనున్న అతిపెద్ద డంపింగ్ యార్డులో ఇసుక రోజుల వ్యవధిలో మాయమైందని ప్రస్తుతం ఇసుక తరలింపుకు తవ్వకాలకు అనుమతులు లేకున్నా దర్జాగా అక్రమ రవాణా చేస్తున్న తీరుపై అధికారులు కఠిన చర్యలు చేపట్టాలని వారు కోరారు.ఈకార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి మున్సిపల్ విభాగ రాష్ట్ర కార్యదర్శి అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, పార్టీ మండలాల కన్వీనర్లు బిజివేముల పిచ్చిరెడ్డి, పులగం శంకర్‌రెడ్డి, చెన్ను వెంకటేశ్వరరెడ్డి , జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిమి రమేష్‌రెడ్డి, అనంతసాగరం ఉప మండలాధ్యక్షులు పాణెం శ్రీనివాసులు, తోడేటి మణి, అశోక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యు.టి.ఎఫ్ రణభేరి ప్రచారజాత బైక్ ర్యాలీ



**కావలి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్రశాఖ సూచనలు మేరకు యూ.టీ.ఎఫ్. కావలి ప్రాంతీయ మండల శాఖల ఆధ్వర్యంలో గురువారం కావలి పట్టణ బృందావనం కాలనీ సమీపంలో ఉన్న హీరోషోరూం వర్ధ నుండి భాష్యం స్కూల్ వరకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూ.టీ.ఎఫ్) రణభేరి ప్రచారజాత బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు మాట్లాడారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లించాలని ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమములు రద్దు చేయాలని తెలియజేశారు. పి.ఆర్.సి.కమిటీని వెంటనే నియమించాలనీ ఉద్యోగులకు 30 శాతం ఐ.ఆర్.ప్రకటించాలని కోరారు ఇతర ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలు ఉపసంహారించాలని తదితరవిషయాలుమీద ప్రజలుకు అవగాహన కల్పించడంజరిగింది. ఈకార్యక్రమంలో యూ.టీ.ఎఫ్. రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు,జిల్లా గౌరవఅధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు,జిల్లాప్రధాన కార్యదర్శి జి.వి. చలపతిశర్మ, కార్యదర్శిలు ఐ.హెచ్.ఎల్. ప్రసాద్,బి.మాధవరావు, రాష్ట్రఆడిట్ కమిటీ సభ్యురాలు బి.శ్రీదేవి, అన్ని మండలాల బాధ్యులు,సీనియర్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## 19,20వ తేదీల్లో స్కూల్ గేమ్స్ సెలక్షన్స్

**దగదర్తి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** ఈనెల 19,20వ తేదీల్లో 69వ స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ దగదర్తి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం నందు జరుగుతుందని మండలంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, ప్రైవేటు పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖాధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో కోకో, కబడ్డీ, వాలీబాల్, చెస్, యోగ, షటిల్ బ్యాడ్మింటన్ అథ్లెటిక్స్, అండర్ 14, అండర్ 17 బాల బాలికలకు మండల స్థాయిలో సెలక్షన్స్ జరుగుతాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనే బాలబాలికలు అండర్ -14 అయితే 01-01-2012, అండర్-17 అయితే 01-01-2009 తరువాత పుట్టిన వారై ఉండాలన్నారు.

## బీజేపీ సేవా పక్షోత్సవాలలో రక్తదాన శిబిరం



**నెల్లూరు అగ్రికల్చర్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త :** దేశ ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవం సందర్భంగా నెల్లూరులో భారతీయ జనతా పార్టీ సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు ఆ పార్టీ విరివిగా సేవా కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ సింగ్ ఆధ్వర్యంలో నెల్లూరు చిన్న బజార్‌లోని బీజేపీ కార్యాయలంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు .ఈ సందర్భంగా యశ్వంత్ సింగ్ మాట్లాడుతూ మోడీ పుట్టిన రోజు వేడుకలను సంతోషంగా జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా అనేక సేవా కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. సేవా పక్షోత్సవాల్లో భాగంగా దేశంలో ఉన్న కామన్ హెల్త్ సెంటర్స్‌లో మహిళలకు ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, అనేక వ్యాధులకు మెరుగైన చికిత్సలు అందించడం జరుగుతుందని వివరించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హేమంత్, పెంచలయ్య, బాలాజీ, సాయి కుమార్, అభి, మధు, రాజు, సత్య, సుందరం, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన





**లింగసముద్రం సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** మండలం లోని పెద్దపవని గురుకుల పాఠశాలలో భూసార పరీక్ష, ఆరోగ్య కార్డులపై రైతులకు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు, విద్యార్థులకు మట్టి పరీక్షల ప్రాముఖ్యత, నేల ఆరోగ్యాన్ని కాపాడే పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో లింగసముద్రం మండల వ్యవసాయ అధికారి సి.హెచ్.వి.ఎల్. దుర్గ, కందుకూరు భూసార పరీక్షా కేంద్రం వ్యవసాయ అధికారి వి. గీతా ప్రకాష్, కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం నుండి వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం విషయ నిపుణుడు వివేక్ కామత్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ, నేల ఆరోగ్యం ఎంత ముఖ్యమో వివరించారు. నేల పరీక్షలు చేయించడం వల్ల ఏ పంటకు ఏ రకమైన పోషకాలు అవసరమో తెలుస్తుందని, తద్వారా అనవసరమైన ఎరువుల వాడకాన్ని తగ్గించి, పంట దిగుబడిని పెంచవచ్చని తెలిపారు. గీతా ప్రకాష్ మాట్లాడుతూ, ప్రతి రైతు మట్టి ఆరోగ్య కార్డును పొందాలని, దానిలోని సూచనల ప్రకారం ఎరువులను వాడుకోవటం ద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. భూమిలో ఉన్న పోషకాల స్థితిని బట్టి ఎరువులు, సూక్ష్మపోషకాలను వాడటం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని వివరించారు.శ్రీ వివేక్ కామత్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నేల పరీక్షలు ఎలా చేస్తారో, నేల ఆరోగ్యాన్ని కాపాడటానికి ఎలాంటి ఇంజనీరింగ్ పద్ధతులు అనుసరించాలో వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా రైతులు, విద్యార్థులు నేల ఆరోగ్యం గురించి మరింత తెలుసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి స్నేహలత, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, రైతులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనుమతులు లేని నిర్మాణాలను నిలిపివేసిన కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ స్థానిక గుడిపల్లి పాడు ప్రాంతాలోని సాయి బృందావనం లేఅవుట్ ను గురువారం పరిశీలించారు. పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు లేని నిర్మాణాలను వెంటనే ఆపివే యాలని, నిర్మాణ పనులు చేపట్టకుండా నిరంతరం టౌన్ ప్లానింగ్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు









## నూతన కలెక్టర్‌ని కలిసిన ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యులు

**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హిమాన్షు శుక్లా ఐఏఎస్‌ని కలెక్టరేట్లోని వారి ఛాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రతిష్టను పెంచేలా రెవెన్యూ ఉద్యోగులు ప్రజలకు సేవ చేయాలని, జిల్లాకు మంచి పేరు తేవాలని తెలిపారు. జిల్లా అధ్యక్షులు అల్లంపాటి పెంచలరెడ్డి, జిల్లా కార్యదర్శి వై నాగేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్, ఆనంద్, కృష్ణ ప్రసాద్, కే. డానియల్ పీటర్ రావు ,హేమంత్ కుమార్, కే బాల కోటమ్మ, ఈ రమాదేవి, అశోక్ కుమార్ పాల్గొన్నారు. తదుపరి రిటైర్డ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ముత్యం నరసింహులు, కె.వి రమణయ్యతో పాటు పలువురు కలెక్టర్‌ని ఘనంగా సన్మానించారు.



## సీజనల్ వ్యాధులు.. జాగ్రత్తలు, నివారణ మార్గాలు

**నెల్లూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త –వైద్యం** మన దేశంలో వాతావరణ పరిస్థితులు మారే కొద్ది వ్యాధుల ఉధృతి కూడా పెరుగుతుంది. ముఖ్యంగా శీతాకాలం, వేసవి కాలంలో కొన్ని వ్యాధులు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ వ్యాధులను ముందుగానే గుర్తించడం, సరైన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.



**శీతాకాలంలో ఎక్కువగా వచ్చే వ్యాధులు:** శీతాకాలం రాగానే ఫ్లూ కేసులు పెరుగుతాయి. దగ్గు, జ్వరం, గొంతు నొప్పి, శరీర నొప్పులు ప్రధాన లక్షణాలు ఫ్లూ రాకుండా ఉండాలంటే చేతులను క్రమంగా శుభ్రం చేసుకోవాలి. జనసమ్మర్ధ ప్రదేశాలలో ఎక్కువసేపు గడపకూడదు. అలాగే టైఫా యిడ్ కూడాఈ కాలంలో విస్తరిస్తుంది. దీర్ఘకాలి కజ్వరం, తలనొప్పి, కడుపునొప్పి దీని లక్షణాలు, టైఫాయిడ్ నివారణ కోసం తాగు నీరు పరి శుభ్రంగా ఉంచుకోవాలి. బయట ఆహారం తీసు కోవడం తగ్గించాలి. వైద్యుల సలహా తప్పని సరిగా తీసుకోవాలి.

**వేసవిలో ఎక్కువగా వచ్చే వ్యాధులు:** వేసవి కాలంలో హీట్ స్ట్రోక్ ఒక ప్రధాన సమస్య. దీని వల్ల అధిక జ్వరం, నీరసం, తలనొప్పి, మూర్ఛ వంటి లక్షణాలు వస్తాయి. దీన్ని నివారించాలంటే ఎక్కువ వేడిలో బయట తిర గకుండా ఉండాలి. శరీరానికి తగినంత నీరు అందించాలి. చల్లని ప్రదేశంలో విశ్రాంతి తీసుకోవాలి. డీహైడ్రేషన్ కూ డా వేసవిలో సాధారణ సమస్య. అలసట, పొడి నోరు, మూత్రం తగ్గడం దీని లక్షణాలు. ఈ సమస్య రాకుండా రోజంతా నీరు మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకోవాలి. ఇంకో పెద్ద సమస్య డయేరియా కలరా. ఇవి ప్రధానంగా కలుషిత నీరు, ఆహారం, వల్లవస్తాయి. విరేచనాలు, వాంతులు, నీరసం, ఇవి ప్రధానలక్షణాలు. వీటిని నివారించడానికి పరిశుభ్రమైన నీరుమాత్రమేతాగాలి. ఆహారాన్ని శుభ్రంగా ఉంచాలి.

**ముగింపు:** ప్రతి సీజన్‌లోనూ వచ్చే వ్యాధులను చిన్న చూపు చూడరాదు. పరిశుభ్రత పాటిం చండ, తగినంత నీరు, పోషకాహారం తీసుకో వడం, డాక్టర్ల సూచనలు పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను సులభంగా నివారించవచ్చు. ఆరోగ్యం కాపాడుకోవడం మనందరి బాధ్యత.




## రోడ్డు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి ఆనం


నెల్లూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త – వైద్యం సంగం మండలం పెరమన గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. మృతుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించిన సీఎం చంద్రబాబునాయుడుకి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎయిడ్స్ నియంత్రణఖు సంచార వాహనం ద్వారా ప్రచారం

**నెల్లూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త –వైద్యం** హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అవగాహన కల్పించే ప్రచారం రథం గురువారం నెల్లూరు జిల్లాకు చేరుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ వారి ఆధ్వ ర్యం లో రూపొందించి న ఈ రథం, నెల్లూరు జిల్లాలో హెచ్ఐవీ, సుఖ వ్యాధులు, మాదక ద్రవ్యాల నిర్మూలన గురించి అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేయబడింది. ఈ వాహనం ద్వారా మీడియా ప్రదర్శనకు స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఈ ప్రచార రథాన్ని నెల్లూరులోని వైద్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ వి.సుజాత గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ వాహనం నెల్లూరు జిల్లాలో 15 రోజులపాటు ప్రమాదకరమైన ప్రవర్తన కలిగిన ప్రదేశాలలో మారుమూల ప్రాంతాలలో అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది, స్వచ్ఛం సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.










## నారాయణ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో 5వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ దినోత్సవ వేడుకలు




**నెల్లూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త –వైద్యం** నారాయణ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో ఫార్మకాలజీ, థెరప్యూటిక్స్ విభాగం ఆధ్వర్యంలో 5వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బిసి రాయ్ లెక్చర్ గ్యాలరీ నందు కామన్ అకడమిక్ ఫ్రోగ్రామ్‌లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమాన్ని నారాయణ వైద్య విద్యా సంస్థల డీన్ డాక్టర్ పి.శ్రీనివాసులరెడ్డి, అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లి దొరసానమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ మాధవులు ఫార్మకోవిజిలెన్స్ ఫ్రోగ్రామ్ ఆఫన ఇండియా యొక్క కీలక పాత్రపై ఇంటరాక్టివ్ గెస్ట్ లెక్చర్ ఇచ్చారు. అలాగే మెడికల్ ఫ్యాకల్టీ, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు ఏడీఆర్‌లను ఎలా నివేదించాలో అవసరమైన మార్గదర్శకత్వం అందించారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన డాక్టర్ కృష్ణచైతన్యకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ వైద్యులు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ శ్రీ శ్రీ భువనేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న వేమిరెడ్డి

**నెల్లూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త –వైద్యం** భక్తుల కోర్కెలు తీర్చే చల్లని తల్లి, శక్తి స్వరూపిణి శ్రీశ్రీశ్రీ భువనేశ్వరి అమ్మవారిని గురువారం నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. నగరంలోని మైపాడు గేట్ కిసాన్ నగర్లోని భవాని నగర్ నందు గల శ్రీ భువనేశ్వరి సమేత అభయ మల్లేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి, స్వామివారికి వీబీ ఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వేమిరెడ్డిని ఘనంగా సత్కరించి శాలువాలతో సన్మానించారు. ఆ తల్లి చల్లని ఆశీస్సులు అందరిపై ఉండాలని వేమిరెడ్డి ఆకాంక్షించారు. ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాద వినియోగాలు అందజేసి వేద ఆశీర్వాదాలు అందించారు. అనంతరం శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించనున్న ఉత్సఊవ ఏర్పాట్లను పరిశీలించిన వీబీఆర్ భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.






## స్వస్త్ నారీ- సశక్త్ పరివార్



**వింజమూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** వింజమూరు మండలం కాటేపల్లి పంచాయతీ కాటేపల్లి గ్రామంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వస్త్ నారీ సశక్త్ పరి వార్ అభియాన్ అనే కార్యక్రమాన్ని చేపట్టి దేశ ప్రజలకు ఆరోగ్యపరమైన జీవితాన్ని అందించే ల క్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు చాకలి కొండ పీహెచ్‌సీ డాక్టర్ మురళీధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ వెంకట సు బ్బయ్య మాట్లాడుతూ ప్రతి పల్లె ఆరోగ్యకరమైన జీవితాన్ని ఏర్పరచుకోవాలని సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలియజేశారు. ఆరోగ్య వంతమైన మహిళల శక్తివంతమైన కుటుంబం అవలంభించడంలో ప్రధాన పాత్ర వహిస్తారన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆరోగ్యవంతమైన సేవలను సులభతరం చేయడంలో ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఆరోగ్యకర విషయాలకు సంబంధించి చక్కెర, వంట నూనెలను 10 శాతం తగ్గించడం ద్వారా తగ్గించవచ్చు, స్థానిక, ప్రాంతీయ ఆహారాన్ని ప్రోత్సహించాలి, ప్రారంభ బాల్య సం రక్షణ, శిశువు చిన్న పిల్లల ఆహార పద్ధతులను మార్చుకోవాలని అన్నారు. రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారం టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి మాతృ వందన వయోజన నమోదు ఆయుష్మాన్ వయో వందన కార్డులో సికెల్ సెల్ కార్డులో లబ్దిదారుల నమో దుపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి తగు సలహాలు సూచనలు ఇచ్చి ఆరోగ్యవం తమైన జీవితంలో భాగస్వామ్యం అవ్వాలన్నారు. ఈ కార్యక్ర మంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కూటమి నాయకులు కాటేపల్లి పంచాయతీ అధ్యక్షులు ఉప్పుటూరి వెంకటరత్నం, డబ్బుకొట్టి హరిబాబు, మాజీ ఎంపీటీసీ ఎం.పెద్ద రాఘవరెడ్డి, చిన్న రాఘవరెడ్డి, పంచాయతీ కోఆర్డినేటర్ గుండుబోయిన మాధవ, గంగిరెడ్డి మణిరత్నం, కొండలరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బార్ లైసెన్సుల కేటాయింపు



**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** జిల్లాలో బార్ లైసెన్సుల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లఆధ్వర్యంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు నిర్వహించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు బార్ లైసెన్సుల కేటాయింపు ప్రక్రియను దరఖాస్తుదారుల సమక్షంలో నిర్వహించారు. 11 బార్లకు జనరల్ కేటగిరిలో ఒక్కొక్కరే దరఖాస్తు చేయగా, వారికి ఆ బార్ లైసెన్సులను కేటాయించారు. ఇందులో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 7 బార్లు, బుచ్చి మున్సిపాలిటీ పరిధిలో ఒక బార్, కావలి మున్సిపాలిటీ పరిధిలో 3 బార్లు ఉన్నాయి. అలాగే అల్లూరు నగరపంచాయతీకి సంబంధించి గీత కులాల కేటగిరిలో ఇద్దరు దరఖాస్తు చేయగా, కలెక్టర్ లాటరీ తీసి ఒకరికి కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఎం. శంకరయ్య, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాసులునాయుడు, సూపరింటెండెంట్ జె రమేష్, ఎక్సైజ్ సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలన

**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమి షనర్ వై.ఓ నందన్ స్థానిక రామ లిం గాపురం అండర్ బ్రిడ్జి ప్రాంతంలో నూ తనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పను లను గురువారం పరిశీలించారు. నిర్మాణ పనులను నిర్దేశించిన సమయంలోపు నా ణ్యతతో పూర్తిచేసి బ్రిడ్జి మార్గాన్ని రవా ణాకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సం స్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## మహిళలు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి

**కావలి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:** మహిళలు సంపూర్ణ ఆరోగ్యం పై అవగాహన కలిగి ఉండి పోషకాహారాన్ని తీసుకోవాలని డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డిలు తెలియజేశారు. రాష్ట్రీయ పోషణ మాసోత్స వాలలో భాగంగా డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో గురువారం కావలి బుడంగుంట గేటు, కచ్చేరిమిట్ట1, 2, అంగనవాడీ కేంద్రాలలో పోషకాహారాల ఎక్సిబిషన్, సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్బంగా వక్తలు మాట్లాడారు పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఆకుకూరలు, చిరుధాన్యాల ప్రాముఖ్యత తెలుపుతూ, వీటిలో పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, మహిళలు, గర్భవతులు, బాలింతలు, రక్తహీనత ఉన్న వారు వాటిని తీసుకోవాలని, రాష్ట్రీయ పోషణ్ మాహ్ ఉద్దేశ్యం అదేనని తెలియజేశారు. మహిళలు సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాలు ఎక్కువ వున్న ఆహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్య వంతులుగా వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు ఎం.మాలకొండ రెడ్డి, రాయపాటి దిలీప్ కుమార్, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రసాద్, ఏ ఎన్ ఎం. సుజాత ,మహిళా సంక్షేమ కార్యదర్శి యశోద.,అంగన్వాడి టీచర్లు జి. విజయలక్ష్మి .కె శాంతి, జి. ప్రసన్నకుమారి గర్భవతులు బాలింతలు పాల్గొన్నారు



## పిడుగుపాటుతో వ్యక్తి మృతి

**కోవూరు సెప్టెంబర్ 18, ప్రభాతవార్త:** తర్వాత కూలి నాలి పనులు చేసుకుంటూ జీవన సాగించే కుటుంబంలో పిడుగు పడి ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది కోవూరు మండలం వేగూరు పంచాయితీ దళితవాడ ప్రాంతానికి చెందిన గోళ్ళ వెంకయ్య.63.. గురువారం యథావిధిగా పశువులు తోలుకొని పొలం లోకి వెళ్ళాడు ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షానికి పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం ఇంటి దగ్గర ఉండి తీరా పశువులు తోలుకొని వచ్చి అకాల మృత్యువాత పడడంతో ఆ కుటుంబం తీరని ఆవేదనలో మునిగిపోయింది . ఈ మేరకు హుటా వెంకయ్యను కోవూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు పరీక్షి ంచిన వైద్యులుఅప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు ఈ మేరకు కుటుంబ సభ్యులు తీరని విషాదంలో మునిగిపోయారు



## బాధితులకు అకండగా నిలబడిన సీఎంకి ధన్యవాదాలు

**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** సంగం మండలం పెరమన వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు అండగా నిలబడిన సీఎం చంద్రబాబు నాయుడుకి, ప్రభుత్వానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఒక్కో కుటుంబానికి 5 లక్షల నష్ట పరిహారం ప్రకటించి ఆదుకుంటుందని చెప్పారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని పేర్కొన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. తక్షణ సహాయం అందజేస్తున్న సీఎంకు కృతజ్ఞతలు చేశారు తెలియజేశారు.